సాక్షి తిరుపతి

శనివారం । 5 । ఆగస్టు । 2023



ఎర్రచందనం అక్రమ రవాణా

అంబులెన్స్‌లో ఇద్దరు రోగులు ఉన్నట్లు నటిస్తూ ఎర్రచందనం రవాణా చేస్తున్న ముఠా గుట్టును టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. - 8లో



విషతుల్య ఆహారోత్పత్తులు

ఆహారోత్పత్తుల్లో క్రిమి సంహారక మందుల అవశేషాల వల్ల ప్రజల ఆయుష్షు తగ్గుతోందని మోహిని మోహన మిశ్రా తెలిపారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	38	26
చిత్తూరు	37	25
తిరుమల	32	21
గూడూరు	38	28
నగరి	38	27

న్యూస్‌రీల్

చంద్రుడి కక్ష్యకు దగ్గరగా చంద్రయాన్-3 మిషన్

సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) గత నెల 14న ప్రయోగించిన చంద్రయాన్-3 మిషన్ లూనార్ ట్రాన్స్ ఇంజెక్షన్ అనే ఆపరేషన్ ద్వారా చంద్రుడి కక్ష్యకు దగ్గరగా వెళుతోంది. శుక్రవారం మధ్యాహ్ననికి చంద్రుడి కక్ష్యలోకి మూడో వంతు ప్రయాణాన్ని పూర్తి చేసింది. శనివారం సాయంత్రం 7 గంటలకు చంద్రుని కక్ష్యలోకి ప్రవేశిస్తుంది. భూమద్యంతర కక్ష్యలో ఏవిధంగా అయితే భూమి దగ్గరగా (పెరిజీ) భూమికి దూరంగా (అపోజీ) మధ్యన దీర్ఘ వృత్తాకార కక్ష్యలో ఎలా తిరిగిందో అదే విధంగా చంద్రుడికి దగ్గరగా, దూరంగా దీర్ఘ వృత్తాకారకక్ష్యలో చంద్రయాన్-3 మిషన్ తిరుగుతుంది. చంద్రుని కక్ష్యలో కూడా అయిదు సార్లు దీర్ఘ వృత్తాకార కక్ష్యలో పరిభ్రమిస్తూనే చంద్రుడికి దగ్గరగా వచ్చి ఈనెల 17 తేదీ నాటికి చంద్రుడికి వంద కిలోమీటర్లు ఎత్తులో వృత్తాకార కక్ష్యలోకి ప్రవేశిస్తుంది. ఆతరువాత 23న ప్రపొల్షన్ మాడ్యూల్ చంద్రుడికి 30 కిలో మీటర్లు దగ్గరగా దిగి ల్యాండర్, రోవర్ మాడ్యూల్‌ను విడిచి పెడుతుంది. ఈ ఆపరేషన్ పూర్తయితే ఈ ప్రయోగం విజయవంతమైనట్టు.

నేడు సోషియల్ టీచర్లకు శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి ఎస్వీయూ క్యాంపస్ స్కూల్లో సోషియల్ టీచర్లకు శనివారం ఒక రోజు జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఈఓ డాక్టర్ వీ.శేఖర్ తెలిపారు. ప్రతి మండలం నుంచి రిసోర్స్ పర్సన్లుగా ఎంపిక చేసిన 57 మంది సోషియల్ టీచర్లు తప్పకుండా హాజరయ్యేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చూడాలని డీఈఓ కోరారు.

ఆపరేటర్లకు వర్క్‌షాప్

తిరుపతి అర్బన్: గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో ఆధార్ కార్డులకు సంబంధించిన వివరాలను నమోదు చేసే సమయంలో తప్పులు లేకుండా చేయాలని ఢిల్లీకి చెందిన ఆధార్ ప్రాధికారిక సంస్థ ట్రైనర్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆధార్ ఆపరేటర్లకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామ, వార్డు సచివాలయ జిల్లా అధికారి సుశీలాదేవి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట డీఎల్‌డీఓలు ఆదిశేషారెడ్డి, శేషయ్య, హైదరాబాద్ ప్రాజెక్టు మేనేజర్ జావిద్, స్టేట్ కో-ఆర్డినేటర్ సాగర్, తిరుపతి, చిత్తూరు జిల్లాల ఆధార్ కో-ఆర్డినేటర్లు వెంకటేష్, మురళి, రెండు జిల్లాకు చెందిన 239 మంది ఆధార్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం.. శ్రీమహాలక్ష్మి యజ్ఞం




హోమ కుండలాల వద్ద పూజలు

తిరుపతి కల్చరల్: సామవాయి రోడ్డులోని శ్రీ కన్వెన్షన్ సమీపంలోని యాగ మండపంలో రెండో రోజు శుక్రవారం చేపట్టిన శ్రీమహాలక్ష్మి యజ్ఞం ఆధ్యాత్మికతను పులకింపజేసింది. ఝులారియా పీఠాధిపతి ఘన్‌శ్యామాచార్యజీ మహరాజ్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు యాగ మండపంలోని 225 కుండలాల యజ్ఞ మండపాలలో యజ్ఞం సాగింది. యజ్ఞ ప్రధాన ఆచార్య కైలాస్ చంద్ర స్వామీజీ వేద పండితులచేత వేదపారాయణం చేపట్టారు. నిర్వాహకులు నవీన్‌మహేశ్వరి, అనురాగ్‌తాజ్, కౌస్తభ్ ఝుకోడియా, సంజయ్ శారద, మహాయాగ యజ్ఞం కో-ఆర్డినేటర్ కె.గిరిధర్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.1.24 కోట్లు

రాపూరు: పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి హుండీ ఆదాయం రూ.1,24,69,785 వచ్చినట్టు ఈఓ జనార్దన్ రెడ్డి తెలిపారు. అలంకార మండపంలో శుక్రవారం 78 రోజులకు సంబంధించిన హుండీ కానుకలను లెక్కించినట్టు వెల్లడించారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో జిల్లా దేవదాయశాఖ అధికారి శ్రీనివాసులురెడ్డి, సీఐ కోటేశ్వరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎలుగుబంటి కలకలం



బాలగంగమ్మ ఆలయం వద్ద ఎలుగుబంటి

తిరుమల: తిరుమలలో బాలాజీనగర్‌లో ఎలుగుబంటి కలకలం సృష్టించిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక బాలాజీ నగర్‌లోని బాలగంగమ్మ ఆలయం వద్ద ఎలుగుబంటి సంచరిస్తూ కనిపించింది. అయితే కొద్దిసేపటికి ప్రజల ఆలికిడి విన్న ఎలుగుబంటి అడవిలోకి వెళ్లిపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

విధ్వంసం.. రక్తసిక్తం

టీడీపీ రౌడీలు విధ్వంసానికి తెగబడ్డారు. జబ్బులు చరుస్తూ.. ఈలలు వేస్తూ గూండాగిరిని ప్రదర్శించారు. మారణాయుధాలతో వీరంగం సృష్టించారు. తమ పార్టీ అధినేత చంద్రబాబు మెప్పు కోసం పేట్రేగిపోయారు. అడ్డూ అదుపూలేకుండా బరితెగించేశారు. ప్రశాంతతకు మారుపేరైన పుంగనూరులో రణరంగం సృష్టించారు. అడ్డొచ్చిన పోలీసులపై రాళ్లు రువ్వుతూ భయానక వాతావరణం కల్పించారు. అక్కడే ఉన్న పోలీసు వాహనాలకు నిప్పుపెట్టి, స్థానికులను భయభ్రాంతులకు గురిచేశారు. వీరి అరాచకాలకు స్థానికులతోపాటు పోలీసులూ బెంబేలెత్తిపోయారు. మహిళలు తలుపులేసుకుని ఇంట్లోకి పరుగులు తీయగా.. దుకాణదారులు, ఇతర వర్తకులు షాపులు మూసేసి ఇళ్లకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఇంతకీ ఎందుకు ఈ విధ్వంసం.. ఎవరిని ఏం చేయాలని..? మీరే చదవండి!

- తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసిన చంద్రబాబు రోడ్‌షో
- కార్యకర్తలను రెచ్చగొట్టి చిచ్చుపెట్టిన వైనం
- పోలీసులపై టీడీపీ రౌడీ మూకల రాళ్ల వర్షం
- 50 మందికి గాయాలు
- వాహనాలకు నిప్పు
- ఉలిక్కిపడ్డ పుంగనూరు



ప్రాణభయంతో పరుగులు

పుంగనూరులోకి రాకుండా పోలీసులు అడ్డుపెట్టిన బారికేడ్ల వద్ద విధ్వంసం సృష్టిస్తున్న టీడీపీ కార్యకర్తలు(ఇన్‌సెట్) పోలీసు వాహనాన్ని ధ్వంసం చేస్తున్న దృశ్యం

పుంగనూరు: 'సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి' పేరుతో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు శుక్రవారం తలపెట్టిన రోడ్‌షో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఎక్కడ చూసినా రివ్వున దూసుకొస్తున్న రాళ్లు.. చెలరేగుతున్న మంటలు స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న పుంగనూరులో యుద్ధవాతావరణం తలపించింది. టీడీపీ రౌడీ మూకల దాడులతో గందరగోళం ఏర్పడింది.

ఉనికి కోసం రూటు మార్చి.. దూసుకొచ్చి

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రోడ్‌షో పుంగనూరు బైపాస్ మీదుగా పలమనేరు వెళ్లాల్సి ఉంది. కానీ ఆయన తన ఉనికి కోసం అడ్డదారులు తొక్కారు. టీడీపీ కార్యకర్తలు, రౌడీమూకలను వెంటబెట్టుకుని అనుమతి లేని మార్గంలో దూసుకొచ్చారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులు పుంగనూరు పట్టణంలోనికి వెళితే శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతుందని భావించి వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ప్రభుత్వ అనుమతి మేరకు బైపాస్‌లో వెళ్లాలని సూచించారు. పోలీసుల మాటలను ఖాతరు చేయని తెలుగు తమ్ముళ్లు ఒక్కసారిగా వారిపైకి తిరగబడ్డారు. రాళ్లు, మద్యం సీసాలు, కర్రలతో దాడులకు తెగబడ్డారు. ఈ సంఘటతో పోలీసులు పరుగులు తీయాల్సి వచ్చింది. అనంతరం టీడీపీ రౌడీలు పోలీస్ వాహనాలకు నిప్పుపెట్టి తగులబెట్టారు.

భయం..భయం

పుంగనూరు ఆహ్లాదానికి.. ప్రశాంతతకు మారుపేరు. ఇక్కడి ప్రజలు మృదుస్వభావం గల సౌమ్యులు. ఇప్పటి వరకు ఎలాంటి గొడవలు లేవు. టీడీపీ అధినేత రాకతో ఇక్కడి వాతావరణం మారిపోయింది. టీడీపీ రౌడీమూకల దాడులతో స్థానికులు భయంతో వణికిపోవాల్సి వచ్చింది.

కేసులు నమోదు

విధి నిర్వహణలో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందిపై దాడిచేసి, వాహనాలను తగులబెట్టిన తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేశారు. పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో సీసీ ఫుటేజీలను పరిశీలించారు.



టీడీపీ అల్లరిమూకల రాళ్లదాడిలో పోలీసులకు రక్త గాయాలయ్యాయి. మహిళా పోలీసులకు సైతం తీవ్ర గాయాలయ్యాయి. ప్రాణభయంతో పలువురు పరుగులు తీయాల్సి వచ్చింది. భద్రతా చర్యల్లో పాల్గొన్న 50 మంది పోలీసులు గాయపడ్డారు. ఐదుగురు సీఐలు, మరో ఐదుగురు ఎస్ఐలు, ఏఎస్పీ, డీఎస్పీతో పాటు సుమారు 35 మంది కానిస్టేబుళ్లకు రాళ్ల దెబ్బలు తగిలాయి.



కాలిబూడిదవుతున్న పోలీసు వాహనం



పోలీసు వాహనాన్ని ధ్వంసం చేస్తూ..



పోలీసుల పైకి రాళ్లు రువ్వుతున్న టీడీపీ కార్యకర్తలు

రెచ్చగొట్టే ధోరణి మంచిది కాదు



రామకుప్పం: చంద్రబాబు రెచ్చగొట్టే ధోరణి మార్చుకోవాలని ఎమ్మెల్సీ భరత్ హితవు పలికారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమే లక్ష్యంగా టీడీపీ శ్రేణులు పనిచేస్తున్నాయని ఆరోపించారు. చంద్రబాబు దురుద్దేశంతోనే టీడీపీ కార్యకర్తలను ఉసిగొల్పారని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ భూస్థాపితం కావడం తథ్యమన్నారు. నీచ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు అని స్పష్టం చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎదుర్కోలేకే కక్షపూరితంగా అల్లర్లకు పాల్పడుతున్నారని విమర్శించారు.

నేడు జిల్లా బంద్

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పర్యటనలో పోలీసులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులపై జరిగిన దాడులకు నిరసనగా శనివారం జిల్లా బంద్‌కు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు భరత్ శుక్రవారం ఈమేరకు ప్రకటన విడుదల చేశారు. ప్రజలు శాంతియుతంగా బంద్‌లో పాల్గొనాలని పేర్కొన్నారు.

పరిశీలన..పరామర్శ

ఈ సంఘటనపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అనంతపురం డీఐజీ రవిప్రకాష్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి పుంగనూరుకు చేరుకుని సంఘటనా స్థలాన్ని, తగులబడిన పోలీస్ వాహనాలను పరిశీలించారు. పరిస్థితులపై పోలీస్ అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పోలీసు సిబ్బందిని పరామర్శించారు. ఎలాంటి అల్లర్లు జరగకుండా పట్టణంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ వాహనాలు, ఆస్తుల వద్ద గస్తీ ఏర్పాటు చేశారు.







టీడీపీ రౌడీల రాళ్ల దాడిలో రక్తగాయాలతో రోదిస్తున్న పోలీసులు

పక్కాగా అభివృద్ధి.. సంక్షేమం

- ముఖ్యమంత్రి దూరదృష్టితో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు
- కుప్పం అభివృద్ధికి రూ.కోట్లు
- ప్రగతి పురోగతికి సమష్టి కృషి
- నియోజకవర్గాల సమీక్షలో మంత్రులు ఉషశ్రీ చరణ్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ మంత్రి ఉషశ్రీ చరణ్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో పక్కాగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల కారణంగా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉషశ్రీ చరణ్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించారు. మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గతంలో ఎమ్మెల్యేలు ఎప్పుడూ ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకునేవారు కాదన్నారు. ప్రస్తుతం గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎక్కడికక్కడ సమస్యలు పరిష్కరిస్తున్నారని వెల్లడించారు. అలాగే జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని చెప్పారు. అన్నిశాఖల అధికారులు సమష్టిగా పనిచేసి అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని ఆదేశించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా నిర్వహిస్తున్న సమీక్షలతో ప్రజాసమస్యలు వెంటనే పరిష్కరించే వెసులుబాటు ఉంటుందన్నారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు ఈ సమీక్షల్లో తొలి ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. జన్మభూమి కమిటీల్లా కాకుండా ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. పుంగనూరు నియోజకవర్గంలో నిర్మిస్తున్న ప్రభుత్వ భవనాల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ కుప్పం అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని, అభివృద్ధి పనులకు రూ. కోట్లు వెచ్చిస్తున్నారని వెల్లడించారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. జేసీ శ్రీనివాసులు, కుప్పం మున్సిపల్ చైర్మన్ సుధీర్, జెడ్పీటీసీ సభ్యులు శరవణ, కృష్ణమూర్తి, నితిన్‌రాఘవరెడ్డి, శ్రీనివాసులు, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ తులసి, ఇతర శాఖల అధికారులు విజయ్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభావతి, రాధమ్మ, గంగాభవానీ, లక్ష్మి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రతి విద్యార్థీ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

– ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): ప్రతి విద్యార్థీ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే బాగా చదువుకోగలరని ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. చంద్రగిరి మండలం, ఏ రంగంపేట మోహన్‌బాబు యూనివర్సిటీలో ఎమ్మెల్యే చెవిరెడ్డి సహకారంతో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యానికేతన్ విద్యార్థులతో పాటు అధ్యాపకులు 1,023 మంది వైద్య పరీక్షలు చేసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చన్న నమ్మకాన్ని డాక్టర్ మోహన్ బాబు నమ్ముతారని తెలిపారు. దీన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. ప్రతి విద్యార్థీ ఏడాదికి ఒకసారి అయినా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహిస్తే మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎంబీయూ వైస్ చాన్సలర్ ఆచార్య నాగరాజ రామారావు ప్రతి విభాగంలో విద్యార్థులు అందరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆదేశించారు. కళాశాలలో ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించడం ఆనందకరమన్నారు. ఎంబీయూ రిజిస్ట్రార్ సారథి, తులసీనాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాబు అడుగుపెడితే హింసే



తిరుపతి మంగళం: చిత్తూరు జిల్లాలో చంద్రబాబు పర్యటించిన ప్రతిసారీ హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్నారని టీటీడీ పాలకమండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్ మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గంలో కిరాయి గుండాలతో చేయించిన హింసాత్మక దాడులే అందుకు నిదర్శనమన్నారు. చంద్రబాబు పర్యటనలను ఎవ్వరూ అడ్డుకోకపోయినా ఏదోఒక రూపంలో రెచ్చగొడుతూ హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రశాంతమైన చిత్తూరు జిల్లాలో గందరగోళం సృష్టించాలన్నదే చంద్రబాబు దురాలోచన అని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మూడు నీటి ప్రాజెక్టులను తీసుకొచ్చి చిత్తూరు జిల్లాను సస్యశ్యామలం చేశారన్న అక్కసుతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎదుర్కోలేక వీధి గూండాలా దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. చంద్రబాబు ఎక్కడ పర్యటించినా ముందస్తు ప్రణాళికతో రౌడీ మూకలను పురమాయించి హింస, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

క్లుప్తంగా

సీకాం డైరెక్టర్ ప్రణీత్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న సీకాం డైరెక్టర్ ప్రణీత్

తిరుపతి సిటీ : సీకాం విద్యాసంస్థల డైరెక్టర్ టి.ప్రణీత్‌కు నార్త్ అమెరికాలోని హయతీ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బ్యాంకాక్‌లో జరిగిన కార్యక్రమంలో భారత మాజీ మంత్రి సురేష్ ప్రభు చేతుల మీదుగా ప్రణీత్ డాక్టరేట్ అందుకున్నారు. గత 13 ఏళ్లుగా ఎడ్యుకేషన్- అడ్మినిస్ట్రేషన్, విద్యా రంగంలో ఆయన చేసిన కృషిని గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళలకు గాయాలు



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళలకు గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీహరి అందించిన వివరాలు.. పులిచర్ల మండలం, కల్లూరు గ్రామానికి చెందిన చరిష్మా (34), యమున(31), మమత(18), సల్మా(14) శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకుని శుక్రవారం తిరిగి ఆటోలో స్వగ్రామానికి వెళుతుండగా మేర్లపాక వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలోని నలుగురు మహిళలకు గాయాలయ్యాయి. గాయపడ్డ వీరిని చికిత్స కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయుష్షు హరిస్తున్న విషతుల్య ఆహారోత్పత్తులు

- గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంతో దీని నుంచి విముక్తి
- రైతులకు శిక్షణ కార్యక్రమాలతో కేంద్రం కార్యాచరణ అవసరం
- భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ నేత మోహిని మోహన మిశ్రా



మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మోహిని మోహన్ మిశ్రా

తిరుపతి కల్చరల్: దేశంలో రోజురోజుకూ ఆస్పత్రులు, మెడికల్ షాపుల సంఖ్య పెరుగుతోందని, ఆహారోత్పత్తుల్లో క్రిమిసంహారక మందులు, రసాయన ఎరువుల అవశేషాల వల్ల ప్రజల ఆయుష్షు తగ్గుతోందని భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మోహిని మోహన మిశ్రా ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సాధికారత సంస్థ, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఇస్కాన్ వద్దనున్న టీటీడీ మైదానంలో మూడు రోజుల ఆర్గానిక్ మేళాను శుక్రవారం ప్రారంభించారు. రైతుల సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా మిశ్రా మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయిలో భారత్‌పై అనేక రకాల కుట్రలు జరిగాయని, ఇందులో ఆహారంపై రసాయన ప్రయోగాలతో ప్రజల ప్రాణాలను హరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రధానంగా విషతుల్య రసాయనాలను పొలాల్లో వాడడం వల్ల భూమి క్రమేణా నిస్సారమవడమే కాకుండా వృక్ష సంపద, పశు సంపద నాశనమవుతుందన్నారు. ప్రస్తుతం ప్రజల్లో అనేక వ్యాధులకు కారణం అధిక రసాయనాలతో కూడిన ఆహార ఉత్పత్తులే కారణమన్నారు. వీటి నుంచి బైటపడాలంటే గో ఆధారిత ప్రకృతి వ్యవసాయం దిశగా రైతాంగం మరలాలని, దీనికిగాను కేంద్రం రైతులకు దేశవ్యాప్తంగా శిక్షణ కార్యక్రమాలతో ప్రత్యేక కార్యాచరణకు పూనుకోవాలన్నారు. రైతు సాధికార సంస్థ మార్కెటింగ్ అధికారి బి.ప్రభాకర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతుల శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇస్తోందని, అంతేకాకుండా ప్రకృతి వ్యవసాయంలో రైతులను శాస్త్రవేత్తలుగా తయారు చేస్తోందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం 665 మండలాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని, తద్వారా 10 లక్షల మంది రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారని తెలిపారు. అలాగే ఆరోగ్యకరమైన వ్యవసాయోత్పత్తులను ప్రజలకు అందిస్తున్నారన్నారు. ప్రధానంగా టీటీడీకి బెల్లం, ఆవు నెయ్యి, శనగలు పలు రకాల కూరగాయలు అందిస్తున్నామన్నారు. ఇకనుంచి 365 రోజుల పాటు తిరుమలలో ఇటు శ్రీవారి ప్రసాదాలు, ఉచిత అన్నదాన కార్యక్రమానికి తమ రైతుల నుంచి అన్ని రకాల ఆహార ఉత్పత్తులు తీసుకుంటామని టీటీడీ అధికారులు తెలిపారని చెప్పారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంతో రైతులు ఎలా ఆర్థికంగా పురోగమిస్తున్నారో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద్ తెలియజేశారు. కార్యక్రమంలో గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం వ్యవస్థాపకుడు కుమార్‌స్వామి, రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణంరాజు, కార్యదర్శి రామమోహన్‌రెడ్డి, రైతు సాధికార సంస్థ తిరుపతి జిల్లా అధికారి మునిరత్నం, చిత్తూరు జిల్లా అధికారి వాసు, మిద్దె తోటల పెంపకందారుల కోర్ కమిటీ సభ్యుడు టీవీ మనోహర్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కార్యదర్శి రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు

సైదాపురం: ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఖనిజ తవ్వకాలు సాగించే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నాగినేని శ్రీనివాసులు హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో అక్రమ తవ్వకాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. సైదాపురం మండలంలో 89 మైనింగ్ లీజులు ఉన్నాయని, మరో 139 మైనింగ్ యా ర్డులకు ఉన్నతాధికారులు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. కొందరు యార్డుల అనుమతులు తీసుకుని లోకల్ ఖనిజాన్ని దిగుమతి చేసుకుంటున్నట్లు తెలుస్తోందన్నారు. వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు.

ఐక్యతగా మెలుగుదాం

- చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండల పార్టీ నేతలతో భేటీ
- దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



చిన్నగొట్టిగల్లులో మాట్లాడుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



ఎర్రావారిపాళెంలో మాట్లాడుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

భాకరాపేట : ఐకమత్యంగా మెలుగుదాం–పార్టీ ఉన్నతికి కలిసికట్టుగా కృషిచేద్దామని వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులతో ఆయన సమావేశమయ్యారు. డివిజన్ స్థాయి కమిటీల ఏర్పాటు అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో సంక్షేమాభివృద్ధి ఘననీయంగా జరుగుతోందని, పేదల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంలో ప్రభుత్వం అన్ని రంగాల్లో చేయూతనందిస్తోందని తెలిపారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందన్నారు. చేసిన మేలును మరోసారి ప్రజలకు గుర్తుచేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు యుగంధర్‌రెడ్డి, శివకుమారి, జెడ్పీటీసీ స్వరూప, కరుణాకర్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొండారెడ్డి, నాగార్జునరెడ్డి, డివిజన్ పార్టీ అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచులు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.61,140
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,491
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.74,200
రిటైల్ వెండి గ్రాము రూ.76.20

చీటీల పేరుతో టోకరా

- రూ.4 కోట్లాకు పైగా మోసం చేసిన ఘనులు
- పరారైన వారిని తీసుకొచ్చి విచారిస్తున్న పోలీసులు

నాయుడుపేట టౌన్: చీటీల పేరుతో అధిక వడ్డీ ఆశ జూపి మహిళల వద్ద రూ.4 కోట్లకుపైగా టోకరా పెట్టిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. మండలంలోని గొట్టిప్రోలు, రాచర్లవడ్డికండ్రిగ, అగచాట్లాపురం తదితర గ్రామాలకు చెందిన 100 మందికి పైగా మహిళలు, పలువురు గ్రామస్తుల నుంచి గొట్టిప్రోలు గ్రామంలో నివాసం ఉంటున్న లింగారెడ్డి రాజారెడ్డి, అతని భార్య సుప్రియ మరికొంతమంది విద్యానగర్ ప్రాంతానికి చెందిన మహిళలు కలిసి చీటీలు వేస్తూ పాడుకున్న వారి నగదుకు అధిక వడ్డీ ఇస్తూ స్థానికులను నమ్మించారు. వడ్డీ అధికంగా వస్తోందన్న ఆశతో అనేక మంది మహిళలు ఒకరికి తెలియకుండా ఒకరు వడ్డీలకు నగదు ఇచ్చారు. కొద్ది రోజులు కిందట రాజారెడ్డి కుటుంబసభ్యులు గ్రామం నుంచి వెళ్లిపోవడంతో ఒక్కసారిగా ఆందోళనలో పడ్డారు. ఈ క్రమంలో కొంతమంది మహిళలు విద్యానగర్‌లో ఉండడంతో వారిని కలిసి తమకు నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో నాయుడుపేట సీఐ నరసింహారావుతో పాటు, డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. స్పందించిన సీఐ పరారైన వారిలో కొంతమందిని తీసుకొచ్చి విచారణ చేస్తున్నారు.

కాటన్ మిల్లులను పునరుద్ధరించరూ!

-కేంద్ర జౌళిశాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు ఎంపీ వినతి



కేంద్ర జౌళి శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు వినతిపత్రం ఇస్తున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : తిరుపతి కాటన్ మిల్లులను పునరుద్ధరించాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కోరారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖామంత్రి పీయూష్ గోయల్‌ను ఆయన కార్యాలయంలో తిరుపతి ఎంపీ కలిశారు. తిరుపతి కాటన్ మిల్లుతో పాటుగా హస్తకళల సేవా కేంద్రం ఏర్పాటు విషయమై చర్చించారు. కాటన్ మిల్లుల పునరుద్ధరణపై గతంలో జౌళి మంత్రిత్వ శాఖ..సమాధానం ఇస్తూ ఆర్థిక మంత్రిత్వ శాఖకు సంబంధించిన నీతి ఆయోగ్, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ విభాగంతో సంప్రదించి పునరుద్ధరణకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తామని తెలియజేసిందని, దీనికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలు ఆయనకి చూపించారు. దారిద్ర్యరేఖకు దిగువన నివసిస్తున్న 1000 కుటుంబాలకు ఈ మిల్లు జీవనోపాధి కల్పిస్తున్నదని, మిల్లు పునరుద్ధరణకు సహకరించాలని ఎంపీ కోరారు. దేశంలోని మొత్తం 23 కాటన్ మిల్లుల గురించి నిర్ణయం తీసుకుంటామని, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న జీతాలని కూడా ఇస్తామని హామీ ఇచ్చారని ఎంపీ తెలియజేశారు. అలాగే తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గంలో కలంకారీ వంటి పురాతన ప్రసిద్ధ హస్తకళలను ప్రోత్సహించడం కోసం తిరుపతిలో హస్తకళల సేవా కేంద్రం ఏర్పాటు చేయాలని, హస్తకళలు మార్కెట్ చేసేందుకు తిరుపతిలో మంచి అవకాశం ఉన్న దృష్ట్యా ప్రాధాన్యత ప్రాతిపదికన తమ ప్రతిపాదనలను పరిశీలించాలని కోరారు. దీనిపై మంత్రి స్పందించారు. పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని ఎంపీకి బదులిచ్చారు.

హాస్టల్లో ఉండడం ఇష్టంలేక..

– ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని



ఆత్మహత్య చేసుకున్న గీతాంజలి

తిరుపతి రూరల్: హాస్టల్లో ఉండడం ఇష్టలేక ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం సాయంత్రం తిరుపతి రూరల్ మండలంలో చోటుచేసుకుంది. రూరల్ సీఐ సుబ్రమణ్యంరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. బైరెడ్డిపల్లి మండలం, టీఎస్ కుప్పానికి చెందిన గీతాంజలి(17) తిరుపతి రూరల్ మండలం, శ్రీనివాసపురంలోని ఎస్ఆర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. హాస్టల్లో ఉండడం ఇష్టం లేదని తల్లిదండ్రులకు వెల్లడించి ఇంటికి వెళ్లింది. చదువు మధ్యలో ఆగిపోకూడదని సర్దిచెప్పిన ఆమె తల్లిదండ్రులు గురువారం ఉదయం గీతాంజలిని ఇంటి నుంచి తీసుకొచ్చి హాస్టల్లో వదిలివెళ్లారు. దీంతో మనస్తాపం చెందిన గీతాంజలి గురువారం సాయంత్రం హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు చున్నితో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గుర్తించిన విద్యార్థినులు వార్డెన్‌కు సమాచారం అందించారు. అనంతరం చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించగా అప్పటికే గీతాంజలి మృతిచెందినట్లు వైద్యుల నిర్ధారించారు. తిరుపతి రూరల్ ఎస్ఐ పూర్యనాయక్ కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

పరిహారం కోసం మృతదేహంతో ధర్నా



మృతదేహంతో స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కుటుంబసభ్యులు

చిల్లకూరు. మండలంలోని తిప్పగుంటపాళెంలో రొయ్యల గుంతలు దున్నుతున్న సమయంలో ట్రాక్టర్ బోల్తా పడి మృతిచెందిన వెంకటసుబ్బయ్య బంధువులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పరిహారం కోసం పోలీస్‌స్టేషన్ ఎదుట శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని నల్లాయగారిపాళెంకు చెందిన వెంకటసుబ్బయ్య, పారిచెర్లవారిపాళెం గ్రామంలోని శ్రీనివాసులురెడ్డి వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శ్రీనివాసులురెడ్డికి చెందిన రొయ్యల గుంతల పనులు చేస్తున్న సమయంలో ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ వెంకటసుబ్బయ్య మృతిచెందాడు. ఈ క్రమంలో మృతుని కుటుంబానికి న్యాయం జరిగే వరకు స్టేషన్ నుంచి కదిలేది లేదని భీష్మించుకున్నారు. దీంతో స్పందించిన ఎస్ఐ ఆందోళనకారులకు నచ్చజెప్పి ఇంటికి పంపించారు.

చేపలు తరలిస్తున్న ఆటో సీజ్



జాలర్లతో మాట్లాడుతున్న ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్ సురేష్

కలువాయి: మండలంలోని దాచూరు సమీపంలో ఉన్న కండలేరు జలాశయంలో నిషేధిత సమయంలో చేపల వేట సాగించి వాటిని అక్రమంగా తరలిస్తున్న ఆటోను ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్ సురేష్ శుక్రవారం సీజ్ చేశారు. మత్స్యకార సొసైటీ సభ్యులు ఇక్కడ అక్రమంగా చేపలను తరలిస్తున్న ఆటోను అడ్డుకుని అధికారులకు అప్పగించారు. దీనిపై ఇన్‌స్పెక్టర్ సురేష్ మాట్లాడుతూ ప్రస్తుతం చేపల వేటపై నిషేధం అమలులో ఉందని, ఎవరూ చేపల వేట సాగించరాదని హెచ్చరించారు. ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేశామని తెలిపారు.

రక్షణ కల్పించాలని వినతి



ఎస్ఐకు వినతిపత్రం ఇస్తున్న ప్రేమజంట

సైదాపురం: తమకు రక్షణ కల్పించాలని కోరుతూ ఓ ప్రేమ జంట శుక్రవారం సైదాపురం పోలీసులను ఆశ్రయించింది. వివరాలు.. మండల కేంద్రమైన సైదాపురం అరుంధతీయవాడకు చెందిన అడసనపల్లి శివ, చిట్టమూరు మండలానికి చెందిన కావ్య ప్రేమించుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ జంట రక్షణ కల్పించాలని కోరుతూ ఎస్ఐ చల్లా వాసుకు విన్నవించారు. వీరి వెంట వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకులు సురేష్ ఉన్నారు. ఇద్దరూ మేజర్లు కావడంతో ఇష్టపడి ప్రేమ వివాహం చేసుకున్నారని, వారికి అండగా నిలవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు.

అందరికీ అందుబాటులో ఓపెన్ స్కూల్



ఓపెన్ స్కూల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కో-ఆర్డినేటర్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం అందరికీ అందుబాటులోకి ఓపెన్ స్కూల్‌ను తీసుకొచ్చిందని రాష్ట్ర కో–ఆర్డినేటర్ పైడాల రవీంద్రనాథ్ తెలిపారు. తిరుపతిలోని ఎస్వీయూ క్యాంపస్ స్కూల్లో శుక్రవారం తిరుపతి జిల్లాలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల కో–ఆర్డినేటర్లకు అడ్మిషన్ల ప్రక్రియపై ఒక రోజు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతిని 2008–09, ఇంటర్‌ను 2010–11 ప్రవేశ పెట్టారన్నారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్లో చేయాల్సి ఉంటుందని చెప్పారు. అడ్మిషన్ల సమయంలో తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ, ఆధార్ వంటి వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని, అలాగే విద్యార్థుల ఫొటో, సంతకాలను అప్‌లోడ్ చేయాలన్నారు. ఓపెన్ స్కూల్ వ్యవస్థలో పదో తరగతిలో 5 సబ్జెక్టులు ఉంటాయని, ఆరవ సబ్జెక్టును ఆప్షనల్‌గా విద్యార్థులు ఎంచుకోవచ్చని, అలాగే తమకు నచ్చిన మీడియంలో పరీక్షను రాయవచ్చని తెలిపారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన తరువాత 30 పీసీపీ తరగతులు నిర్వహించాలని, 3ట్యూటర్ మార్క్‌డ్ అసైన్‌మెంట్లు, 2 ప్రిపరేటరీ పరీక్షలు విద్యార్థులతో రాయించాలని చెప్పారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందించాలని పేర్కొన్నారు. ఇది పూర్తిగా సామాజిక సేవా కార్యక్రమమనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఓపెన్ స్కూల్ విద్య రెగ్యులర్ విద్యతో సమానంగా పరిగణిస్తారని తెలిపారు. ఇకపై ధ్రువీకరణ పత్రాలు డిజీలాకర్‌లో రాబోతున్నాయన్నారు. విభిన్న కారణాలతో చదువును మధ్యలో మానేసిన వారు, ఉద్యోగంలో ప్రమోషన్లు కోరే ఉద్యోగస్తులు, గృహిణులు వంటి వారు ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవచ్చని సూచించారు. అనంతరం ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల పోస్టర్లను ఆవిష్కరించారు. తిరుపతి జిల్లా ప్రభుత్వ పరీక్షల విభాగపు అసిస్టెంట్ కమిషనర్ ఆనందరెడ్డి, డీఈఓ కార్యాలయ సిబ్బంది, కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

సినిమా ఫక్కీలో ఎర్రచందనం రవాణా

- అంబులెన్స్‌లో ఎర్రచందనం తరలిస్తున్న పది మంది అరెస్ట్
- టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ మురళీధర్ వెల్లడి



టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, అంబులెన్స్

తిరుపతి మంగళం: సినీ ఫక్కీలో అంబులెన్స్‌లో ఇద్దరు రోగులు ఉన్నట్లు నటిస్తూ ఎర్రచందనం రవాణా చేస్తున్న ముఠా గుట్టును టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. పది మందిని అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను తిరుపతిలో టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ మురళీధర్ వెల్లడించారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై అందిన సమాచారం మేరకు శుక్రవారం ఉదయం కడప సబ్ కంట్రోల్ నుంచి ఆర్ఎస్ఐ రాఘవేంద్ర బృందం రైల్వే కోడూరు రేంజ్ బాలపల్లి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టింది. బాలపల్లి ఈస్ట్ రేంజ్ అటవీ ప్రాంతంలో శుక్రవారం ఉదయం ఒక వ్యక్తి బైక్‌పై వెళుతూ కనిపించగా, అనుమానంతో అతడ్ని తీసుకుని ముందుకువెళ్లగా, అక్కడ ఒక అంబులెన్సులో ఎర్రచందనం దుంగలను ఎక్కిస్తూ స్మగ్లర్లు కనిపించారు. అక్కడ ఉన్న ఏడుగురు స్మగ్లర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పది ఎర్రచందనం దుంగలు, అంబులెన్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

నెల్లూరు టు బాలపల్లి..

వయా తమిళనాడు, బెంగళూరు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వింజమూరుకు చెందిన రమణారెడ్డి అనే వ్యక్తి తమిళనాడుకు చెందిన ఏలగిరి అనే మేస్త్రీ ద్వారా తమిళ కూలీలను సమకూర్చుకుని బెంగళూరుకు పంపించారు. అక్కడి నుంచి ఈ కూలీలను ప్రసాద్ అనే వ్యక్తి తీసుకుని తిరుపతి మీదుగా బాలపల్లి అటవీ ప్రాంతానికి చేరుకున్నారు.

బాలపల్లి వద్ద అంబులెన్సులోకి ఎర్రచందనం దుంగలను ఎక్కించుకుని లక్ష్మీనరసయ్య అనే వ్యక్తి డ్రైవరుగా, ప్రసాద్, మహేష్ రోగులుగా నటిస్తూ ఎర్రచందనాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. కేసులో 14మంది ఉండగా, 10మందిని అరెస్టు చేశారు. వారిలో కడపకు చెందిన నిమ్మల ప్రసాద్(49), లక్ష్మీనరసయ్య(47), ప్రొద్దుటూరుకు చెందిన జి.సతీష్‌కుమార్(37), తిరువణ్ణామలైకి చెందిన మరిదిరి(61), గోవిందన్(45), కాళి(49), జి.సేతు(35), కాశి(35), హరి(25), రాజమాణిక్యం(40) ఉన్నారని డీఎస్పీ వివరించారు. మరో నలుగురు పారిపోయారని, వారిని పట్టుకోవడానికి ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డితో ప్రత్యేక బృందాన్ని నియమించామని చెప్పారు. ఆర్ఐ సురేష్‌కుమార్ రెడ్డి, సీఐ శ్రీనివాసులు, ఎఫ్ఆర్ఓ ప్రేమ పాల్గొన్నారు.